సాక్షి చిత్తూరు

గురువారం । 18 । జనవరి । 2024



జగనన్న పాలనలో రోజూ పండగే

జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలకు ప్రతి రోజూ పండగేనని పర్యాటక, క్రీడల శాఖా మంత్రి రోజా తెలిపారు. - 10లో



దుమ్మురేపిన కోడెగిత్తలు

జిల్లాలోని పెనుమూరు,వెదురుకుప్పం మండలాల్లో బుధవారం నిర్వహించిన ఎడ్లపందేలు కోలాహలంగా సాగాయి. - 10లో



పండుగకే తలమానికం కొండచుట్టు

పెద్దపండుగకే తలమానికంలా కొండచుట్టు ఉత్సవాలు పెనుమూరు, పుత్తూరు మండలాల్లో వైభవంగా సాగాయి. - 10లో

న్యూస్‌రీల్

సచివాలయాల సేవలు అభినందనీయం



పుల్లూరు సచివాలయంలో తమిళనాడు ఆరోగ్య శాఖ మంత్రి సుబ్రమణియన్

ఐరాల: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని తమిళనాడు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సుబ్రమణియన్‌ తెలిపారు. ఆయన బుధవారం స్వగ్రామమైన ఐరాల మండలం పుల్లూరులో మిత్రులైన రాజేష్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డిని కలిశారు. వారందరూ వైఎస్సార్‌సీపీ యువనేత హరీష్‌రెడ్డితో కలిసి గ్రామంలోని సచివాలయం, ఆర్బీకేను సందర్శించారు. ప్రభుత్వ పథకాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సచివాలయ వ్యవస్థను రూపకల్పన చేసిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనను కొనియాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.

డీఆర్‌ఓగా దేవేంద్రరెడ్డి నియామకం

చిత్తూరు కలెక్టరేట్‌ : జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ)గా వి.దేవేంద్రరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌ సెక్రటరీ జవహర్‌రెడ్డి జారీ చేసిన ఉత్తర్వులు బుధవారం కలెక్టరేట్‌కు అందాయి. డిప్యూటీ కలెక్టర్‌ హోదాలో ఉన్న దేవేంద్రరెడ్డి త్వరలో డీఆర్‌వోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం డ్వామా పీడీగా ఉన్న రాజశేఖర్‌ డీఆర్‌ఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

నేటి నుంచి పశుబీమా

చిత్తూరు అగ్రికల్చర్‌: పశువులు, జీవాలకు గురువారం నుంచి బీమా చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్లు పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్‌ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 12 వేల పశువులకు రెండో విడతగా వైఎస్సార్‌ బీమా ప్రీమియం చెల్లింపులకు రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు అందులో పేర్కొన్నారు. దీంతో మిగిలిన పశువులు, జీవాలకు కూడా బీమా చేసుకునేందుకు పాడి రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒక కుటుంబానికి 5 పశువులు, 50 జీవాల వరకు బీమా వర్తిస్తుందన్నారు. పదేళ్ల పైబడిన ఎద్దులు, దున్నలు, 6 నెలల వయసులోపు గొర్రెలు, మేకలు, పందులకు బీమా వర్తించదని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం టోల్‌ ఫ్రీ నంబర్‌ 1962ను సంప్రదించాలని చెప్పారు.

సంక్రాంతి సెలవులు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్‌: సంక్రాంతి సెలవులను మరో రెండు రోజులపాటు పొడిగించినట్లు డీఈఓ విజయేంద్రరావు వెల్లడించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రుల కోరిక మేరకు సెలవులు పొడగిస్తూ రాష్ట విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ నెల 19వ తేదీన ప్రారంభించాల్సిన బడులు ఈ నెల 22వ తేదీన పునః ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ నిబంధనలు అన్ని యాజమాన్యాలకు వర్తిస్తాయని డీఈఓ వెల్లడించారు.

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్‌ : గణతంత్ర వేడుకలకు జిల్లా పోలీస్‌ పరేడ్‌ మైదానంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్‌ కలెక్టర్‌ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణ బాధ్యతలు చిత్తూరు ఆర్డీఓకు అప్పగించారు. మైదానంలో బందోబస్తు, జెండా వందనం, స్టేజ్‌ డెకరేషన్‌, కవాతు ఏర్పాట్లు పోలీస్‌ శాఖకు, సీటింగ్‌ ఏర్పాట్లు చిత్తూరు తహసీల్దార్‌కు, సాంస్కృతిక ప్రదర్శనల నిర్వహణ బాధ్యతలు డీఈఓకు కేటాయించారు. అస్తుల పంపిణీ, స్టాల్స్‌ ఏర్పాట్లను డీఆర్‌డీఏ పీడీ, ప్రథమ చికిత్స కేంద్రం, అత్యవసర వైద్య సేవల ఏర్పాట్లు డీఎంహెచ్‌ఓ, పారిశుధ్యం, తాగునీరు, వసతి ఏర్పాట్లను చిత్తూరు మున్సిపల్‌ కమిషనర్‌, స్టాల్స్‌ వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రదర్శనలు డీఆర్‌డీఏ, హౌసింగ్‌, వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, దివ్యాంగులు, ఐసీడీఎస్‌ శాఖలకు బాధ్యతలు అప్పగించారు. ఈ సమావేశంలో అధికారులు పద్మనాభం, చిన్నయ్య, మురళీకృష్ణ, మధుసూదన్‌ రెడ్డి, శోభారాణి, విజయేంద్రరావు పాల్గొన్నారు.

ఆనందం పరవళ్లు

కృష్ణాజలాల పరవళ్లతో కుప్పం నియోజకవర్గం పులకిస్తోంది.. దశాబ్దాల కల నెరవేరినందుకు రైతాంగం సంబరపడుతోంది.. బంజరు భూమిలో సైతం ఇక బంగారం పండనుంది.. నెర్రెలు బారిన నేల సస్యశ్యామలం కానుంది.. ఏళ్ల తరబడి చంద్రబాబు బూటకపు హామీలతో కుంగిపోయిన ప్రజానీకం కృష్ణమ్మ రాకతో హర్షాతిరేకం వ్యక్తం చేస్తోంది. ఇచ్చిన మాట చెల్లించిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తోంది.. హంద్రీ–నీవా కాలువ ద్వారా నీటి కష్టాలు తీర్చినందుకు కృతజ్ఞతలు చెబుతోంది.

- కుప్పం చేరిన కృష్ణా జలాలు
- సంబరంగా స్వాగతం పలికిన ప్రజలు
- సస్యశ్యామలంగా మారనున్న కరువు ప్రాంతం
- హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రికి రైతుల కృతజ్ఞతలు



కుప్పం నియోజకవర్గంలోకి ప్రవేశిస్తున్న కృష్ణా జలాలు (ఇన్‌సెట్‌) స్వాగతం పలికిన అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్‌, పక్కన ఎంపీ రెడ్డెప్ప



కుప్పం : హంద్రీ–నీవా సుజల స్రవంతిలో భాగంగా జిల్లాలోని పడమటి మండలాలకు తాగు.. సాగు నీటిని అందించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి సంకల్పించారు. ఈ మేరకు 2006లో తలపెట్టిన పాలారు ప్రాజెక్టుకు తమిళనాడులోని రాజకీయపార్టీలతో కలిసి చంద్రబాబు మోకాలడ్డారు. అయినప్పటికీ కుప్పానికి కృష్ణా జలాలు తీసుకురావాలని వైఎస్సార్‌ హంద్రీ–నీవా కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. శ్రీశైలం నుంచి కుప్పం వరకు చేపట్టిన కాలువ పనులు ఆయన మరణంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. అనంతరం 2014 అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తూతూ మంత్రంగా పనులు చేపట్టారు. 2019 ఎన్నికల సమయంలో బోర్ల ద్వారా నీరు పంపింగ్‌ చేయించి జల హారతులు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారు. అయితే బాబు మోసాలను కుప్పం వాసులు కొద్దిరోజులకే కనిపెట్టారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, సుమారు 35 ఏళ్ల పాటు కుప్పం ఎమ్మెల్యేగా పనిచేసినా చంద్రబాబు తమకు చేసింది శూన్యమని గ్రహించారు. అందుకే తర్వాత వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీని అథఃపాతాళానికి తొక్కేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సైతం బాబుని తిరస్కరించేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఇచ్చిన హామీ మేరకు..

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష నేత నియోజకవర్గమైనా కుప్పంపై ఏనాడూ వివక్ష చూపలేదు. రూ.వందల కోట్లు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ క్రమంలోనే గత ఏడాది సెప్టెంబర్‌లో కుప్పం ప్రజల దశాబ్దాల కలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను తీసుకువచ్చి తాగు..సాగు నీరు అందిస్తామని స్పష్టం చేశారు. ఆ మేరకు కాలువ పనులు పరుగులు తీయించారు. స్థానికుల స్వప్నం సాకారం చేస్తూ బుధవారం హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ కుప్పం నియోజకవర్గానికి చేరింది. దీంతో ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇచ్చిన హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రిపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

మారనున్న బతుకులు

మారుమూల ప్రాంతమైనా కుప్పం నియోజకవర్గంలో ప్రజానీకం అధికంగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో కరువు కాటకాల కారణంగా ఎక్కువ మంది వలస బాట పట్టారు. కుప్పం నుంచి బెంగళూరుకు వెళ్లి కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. ప్రస్తుతం కృష్ణా జలాల రాకతో ఇక్కడి ప్రజల జీవన స్థితిగతుల్లో గణనీయమైన మార్పు రానుంది. వలస బతుకులకు జీవనాధారం ఏర్పడనుంది. వ్యవసాయం, పాడి పరిశ్రమపై దృష్టి పెట్టే వెసులుబాటు వచ్చింది. ఇప్పటికే గత నాలుగున్నరేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో చాలా మంది పాడి, వ్యవసాయం వైపు మొగ్గు చూపారు. ఇప్పుడు కృష్ణా జలాలు కూడా రావడంతో నీటి కష్టాలు పూర్తిగా తీరినట్లే అని కుప్పం వాసులు ఆనందిస్తున్నారు. ఎక్కడికీ వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత ఊర్లో సగౌరవంగా జీవనం సాగించవచ్చని వెల్లడిస్తున్నారు. కరువు ప్రాంతం త్వరలోనే పచ్చదనంతో సస్యశ్యామలంగా మారుతుందని సంతోషంగా చెబుతున్నారు.

చరిత్రలో నిలిచి పోతారు



ఎన్నో ఏళ్లుగా హంద్రీ–నీవా కాలువ ద్వారా నీరు వస్తుందని ఎదురుచూస్తున్నాం. ఇన్నాళ్లకు మా కల నెరవేరింది. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు. మేం ఏళ్ల తరబడి మోసిన చంద్రబాబు మా నెత్తిన ఎప్పుడూ కుచ్చుటోపీ పెట్టేవారు. ఇప్పటి వరకు ఈ విధంగా చెప్పిన మాట నిలబెట్టుకున్న నాయకుడిని చూడలేదు.

– వెంకటేష్‌, యమునాసనపల్లె

రుణం తీర్చుకోలేం



కృష్ణా జలాలతో మాకు నీరందించిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రుణం ఎప్పటికీ తీర్చుకోలేం. తండ్రికి తగ్గ తనయుడిగా మాట నిలబెట్టుకున్నారు. బోర్లు, బావులు ఎండిపోయి వ్యవసాయం చేయలేక నానా అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు మా కష్టాలు గట్టెక్కాయి. గతంలో నేతలు మమ్మల్ని ఓటర్లగానే చూసేవారు. జగనన్నే మమ్మల్ని మనుషులుగా చూస్తున్నారు.

– మల్లప్ప, సలార్లపల్లె

కరువు తీరింది



హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు కుప్పం రావడంతో మా కరువు తీరింది. ఇది వరకు నీటి కోసం మైళ్ల దూరం నడచి వెళ్లి తెచ్చుకునేవాళ్లం. నీటి కష్టాలు తీర్చాలని దశాబ్దాలుగా పోరాడుతున్నాం. ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నిసార్లు గెలిపించినా చంద్రబాబు మమ్మల్ని ఎప్పుడూ మోసమే చేసేవారు. ఇన్నాళ్లకు మా ఇక్కట్లు తీర్చిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన మేలు మరువలేం.

– నారాయణప్ప, నలగంపల్లె

కల సాకారం



హంద్రీ–నీవా కాలువ నుంచి నీరు కుప్పానికి రావడంతో ఆనందం పట్టలేకున్నాం. వ్యవసాయం ఆపేసి ప్రస్తుతం అక్కడా ఇక్కడా కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నాం. ఇకపై మాకు ఆ కష్టాలు ఉండవు. మా భూమిలో పంటలు సాగు చేసుకుని గౌరవంగా బతుకుతాం. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చలువే. మా కల సాకారం చేశారు.

– కృష్ణప్ప, శెట్టిపల్లె

దేవతలే తరలివచ్చి ఆశీర్వదించగా..



కొండచుట్టు మండపంలో వినాయకుని దర్శించుకున్న మంత్రి ఆర్కేరోజా



కొండచుట్టు మండపం వద్దకు తరలివచ్చిన దేవతలు

- ఊరేగింపుగా వచ్చిన గ్రామ దేవతలు
- అంగరంగ వైభవంగా కొండచుట్టు ఉత్సవం

నగరి : పట్టణంలో కొండచుట్టు ఉత్సవం అంగరంగ వైభవంగా సాగింది. కొండచుట్టు మండపం వద్ద బుధవారం ఉదయం నుంచే హడావుడి మొదలైంది. పరిసర గ్రామాల నుంచి వచ్చే దేవతలకు స్వాగతం పలికేందుకు ముందుగా వెళ్లాల్సిన కరకంఠేశ్వర స్వామికి అభిషేక అర్చనలు చేసి అలంకరించారు. సాయంత్రం కొండచుట్టు మండపం వద్దకు వేంచేపు చేశారు. స్వామి ఆహ్వానం మేరకు పాళమంగళం నుంచి పాళేశ్వర స్వామి, ముడిపల్లి అగస్తీశ్వర స్వామి, కరింబేడు నాథాళీశ్వర స్వామి, మేళంబాకం రాధాకృష్ణస్వామి, మిట్టపాళెం పాళేశ్వరస్వామి, దేశూరు అగరం నుంచి వేణుగోపాలస్వామి, కృష్ణారాపురం గ్రామం నుంచి శివపార్వతులు, తెరణి వైకుంఠనాథ స్వామి, సత్రవాడ నుంచి చిదంబరేశ్వర స్వామి, శివగామి సుందరి, చింతలపట్టెడ శరవణవినాయక, అగరవినాయక స్వాములు, మేళపట్టు ఈశ్వరస్వామి, ఎలకాటూరు కృష్ణమూర్తి స్వామి, ముడిపల్లి అగస్తీశ్వర స్వామి, రాధారుక్మిణి స్వాములు, చవరంబాకం పరమేశ్వరస్వామి, కళియంబాకం కాళేశ్వర స్వామి, జ్ఞానమ్మ పట్టెడ నుంచి మీనాక్షి దేవి, మూలనెత్తం గ్రామం నుంచి ఈశ్వరుడు, వినాయకుడు కొండచుట్టు మండపానికి విచ్చేశారు. ఊరేగింపుగా విచ్చేసిన దేవతలకు గ్రామస్తులు దారి పొడవునా రంగవల్లికలతో స్వాగతించారు. కర్పూర హారతులు ఇచ్చి కొబ్బరి కాయలు కొట్టి దర్శించుకున్నారు. వివిధ గ్రామాల నుంచి ట్రాక్టర్లపై వచ్చిన ఉత్సవ మూర్తులకు కరకంఠేశ్వర స్వామి ఎదురెళ్లి స్వాగతం పలుకగా కొండచుట్టు మండపం వద్దకు చేరి విఘ్నేశ్వరుని దర్శించుకొని సమీప మైదానంలో కొలువుదీరారు. రాత్రి కొండచుట్టు మండపం సమీపం ఉన్న మైదానంలో ఉత్సవ విగ్రహాలు కొలువుదీరగా ఆ కమనీయ దృశ్యాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దేవతల తరపున అర్చకులకు కరకంఠేశ్వర స్వామి ఆలయ అర్చకులు పరివట్టం కట్టి మర్యాదలు చేసి వీడ్కోలు పలికారు. ఏక కాలంలో అందరు దేవతలు ఒక్కచోటకు చేరడం అందరికీ ఒక్కసారిగా హారతి ఇవ్వడం ప్రత్యేక సంతరించుకుంది. కొండచుట్టు మండపం వద్ద గురువారం వేకువజాము నుంచే తిరనాళ్ల సందడి నెలకొంది. పరిసరాల్లో తినుబండారాల విక్రయదారులు, బొమ్మలు, గాజులు, బొరుగులు, చెరకు గడలు విక్రయించేవారు దుకాణాలకు స్థలాలు ఆక్రమించుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ప్రజలు కొండచుట్టు మండపం వైపు నడక సాగించడంలో కొండచుట్టుకు వెళ్లే మార్గం కిక్కిరిసిపోయింది. కొండ చుట్టు మండపం నుంచి సుమారు కిలోమీటరు మేర జనసందోహం కనిపించింది. యువకులు గుంపులు గుంపులుగా మిత్రులతోను, పెద్దలు వారి వారి కుటుంబ సభ్యులతోను కొండచుట్టు మండపం వైపు నడక సాగించారు. నగరి పట్టణం వదిలి ఇతర ప్రాంతాలలో స్థిరపడిన వారు కూడా కొండచుట్టు ఉత్సవాలకు హాజరయ్యారు. రాత్రి దీప కాంతులతో కొండచుట్టు మండపం శోభాయమానంగా కనిపించింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు డీఎస్పీ రవికుమార్‌ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. మంత్రి ఆర్కేరోజా పార్టీ శ్రేణులతో కలిసి మండలంలోని వినాయకుని, ఊరేగింపుగా విచ్చేసిన దేవతలను దర్శించుకున్నారు.





దేవతలకు స్వాగతం పలికేందుకు వచ్చిన కరకంఠేశ్వర స్వామి, దీపపు కాంతుల్లో కొండచుట్టు మండపం

23 నుంచి అసెస్‌మెంట్‌ పరీక్షలు



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్‌ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు సీబీఏ–2 (క్లాస్‌ రూం బేస్డ్‌ అసెస్‌మెంట్‌), ఎఫ్‌ఏ–3 (ఫార్మేటివ్‌ అసెస్‌మెంట్‌–3) పరీక్షలు నిర్వహించాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీచేశారన్నారు. షెడ్యూల్‌ ప్రకారం పరీక్షల నిర్వహణకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. బడులు తెరిచిన తరువాత విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

- 1 నుంచి 5 తరగతులకు సీబీఏ –2 పరీక్షలు
- ఈనెల 23వ తేదీ ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం, 25వ తేదీ ఉదయం ఎన్విరాన్‌మెంటల్‌ సైన్స్‌, మధ్యాహ్నం ఇంగ్లీష్‌, 27న ఉదయం 3 నుంచి 5 తరగతులకు ఓఎస్‌ఎస్‌సీ పరీక్షలు ఉంటాయని తెలిపారు.
- 6 నుంచి 8 తరగతుల షెడ్యూల్‌
- ఈ నెల 23న తెలుగు, గణితం, ఈ నెల 25న హిందీ, జనరల్‌ సైన్స్‌, ఈ నెల 27న సోషియల్‌ స్టడీస్‌, ఈ నెల 29న ఇంగ్లీష్‌, 30న ఓఎస్‌ఎస్‌సీ పరీక్షలు ఉంటాయని వెల్లడించారు.
- 9, 10 తరగతుల షెడ్యూల్‌
- ఈ నెల 23న తెలుగు, గణితం, ఈ నెల 25న హిందీ, జనరల్‌ సైన్స్‌, ఈ నెల 27న సోషియల్‌ స్టడీస్‌, ఈ నెల 29న ఇంగ్లీష్‌, ఈ నెల 30న ఓఎస్‌ఎస్‌సీ పరీక్షలు నిర్వహించాలని డీఈఓ ఆదేశించారు.

చందనాలంకారంలో వరసిద్ధుని దర్శనం





ఊంజల్‌ సేవలో స్వామివారు, కమిషనర్‌కు చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి చందన అలంకరణలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. కనుమ పండుగ సందర్భంగా(గోట్‌) ప్రధాన ఆలయంలో స్వయంభుగా వెలసిన వినాయకునికి వేకువజామున ఆలయ అర్చకులు చందన అలంకరణ చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు భారీగా తరలి వచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ఊంజల్‌ సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉభయదారులుగా కాణిపాకానికి చెందిన సల్లా శివశంకర్‌ శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయంలోని ధ్వజస్తంభాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

వరసిద్ధుని సేవలో చీఫ్‌ కమిషనర్‌

రాష్ట్ర జీఎస్‌టీ చీఫ్‌ కమిషనర్‌ గిరిజ శంకర్‌ వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. ఆయన స్వామివారి దర్శనార్థం బుధవారం కుటుంబంతో కలసి విచ్చేయగా ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

స్వచ్ఛ తీర్థ సేవ

ఆలయ పరిసరాల్లో బుధవారం స్వచ్ఛ తీర్థ (ఆలయ శుద్ధి) సేవ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పరిసరాలన్నీ శుభ్రం చేశారు. నిత్యఅన్నదానం, కల్యాణ కట్ట, వినాయక సదన్‌, తదితర ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఏఈఓలు విద్యాసాగర్‌ రెడ్డి, ఎస్పీవీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్‌ వాసు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ తిరుమల గిరిబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

22న వర్క్‌షాప్‌

చిత్తూరు కలెక్టరేట్‌ : సర్కారు బడులను గ్రీన్‌ స్కూల్స్‌గా తీర్చిదిద్దేందుకు ఈ నెల 22న ఎంపిక చేసిన పాఠశాలల హెచ్‌ఎం, సబ్జెక్ట్‌ టీచర్లకు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయానికి రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ ఎస్‌పీడీ జారీచేసిన ఉత్తర్వులు అందాయి. ఆ ఉత్తర్వుల మేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాలోని పలు పాఠశాలల హెచ్‌ఎంలను ఎంపిక చేశారు. చిత్తూరు జిల్లాలోని వి.కోట మండలం ముదరందొడ్డి జెడ్పీ హైస్కూల్‌ హెచ్‌ఎం బాలచైతన్య, తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి జెడ్పీ హైస్కూల్‌ లో పనిచేస్తున్న నీలకంఠయ్య(గ్రీన్‌స్కూల్స్‌ రాష్ట్ర కో ఆర్డినేటర్‌), వడమాలపేట మండలం జెడ్పీ పత్తిపుత్తూరు హైస్కూల్‌లో పనిచేస్తున్న హరిశంకర్‌ ఒకరోజు వర్క్‌షాప్‌కు హాజరుకావాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.



వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేతలు



ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నేతలు

రామకుప్పం: మండలంలోని బల్ల పంచాయతీకి చెందిన 8 మంది టీడీపీ నేతలు బుధవారం ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట మేరకు కుప్పానికి హంద్రీ నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు తీసుకుని వచ్చారన్నారు. కుప్పంలో వైఎస్సార్ సీపీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన వారిలో వెంకటప్ప, రవి, మురళి, శంకరప్ప, కుమార్, ఎస్.శంకరప్ప ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, స్థానిక సర్పంచ్ విజయ్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,016 మంది స్వామివారిని దర్శించుకోగా 20,915 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ. 3.46 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జగనన్న పాలనలో రోజూ పండుగే



ఎడ్ల బండిపై మంత్రి ఆర్కే రోజా దంపతులు



పొంగలి పెడుతున్న మంత్రి రోజా

- మంత్రి ఆర్కే రోజా

నగరి : జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలకు ప్రతిరోజు పండుగే అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం స్థానిక డిగ్రీకళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయిలో రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మంత్రి, తన భర్త ఆర్కేసెల్వమణితో కలిసి ఎద్దుల బండిపై విచ్చేశారు. పోటీల నిర్వహణలో భాగంగా మైదానంలో ఏర్పాటు చేసిన చిలకజోస్యం స్టాల్ వద్ద ఆమె జోస్యం చెప్పించుకోవడం, ఎంపీపీకి మెహందీ పెట్టడం, కౌన్సిలర్లు, మహిళలకు ఆమె స్వయంగా గాజులు తొడగటం ప్రత్యేకతగా నిలిచింది. మైదానంలో సంప్రదాయం ప్రకారం పొంగలి పెట్టి దూడూ బసవన్నకు పూజలు చేశారు. సంక్రాంతి పిండి వంటలను తెలిపే ఐసీడీఎస్ బజార్‌లో మంత్రి రోజా, అతిథులు పిండివంటలను రుచి చూశారు. అనంతరం బహుమతుల పంపిణీ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ జగనన్న ప్రతి ఇంటికీ ఏం చేస్తే ఆ కుటుంబ సభ్యులు సంతోషంగా ఉంటారన్న విషయం తెలుసుకోవడానికి వారి ఇళ్ల వద్దకే వలంటీర్‌ను పంపి, తెలుసుకుని ప్రతి సంక్షేమ పథకాన్ని వారి ఖాతాలకు జమ చేసి, అందరినీ ఆదుకుంటున్నారన్నారు. నేడు ఆనందంగా సంక్షేమ సంక్రాంతిని వారు జరుపుకుంటున్నారన్నారు. నగరిలో కొండచుట్టు కార్యక్రమానికి చాలా విశిష్టత ఉందని అందుకే ఈ రోజున పోటీలు నిర్వహించామన్నారు. సాంస్కృతిక శాఖ మంత్రిగా సంప్రదాయాలు కాపాడాలన్న తపన, అక్కచెల్లెళ్లను సంతోషపెట్టాలన్న కోరికే పోటీల నిర్వహణకు దారితీసిందన్నారు. పోటీలో పాల్గొన్న వారందరికీ ప్రెషర్‌కుక్కర్ ఇచ్చి పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఎక్కిన యువకుడు



సెల్‌టవర్ ఎక్కిన యువకుడు మౌలాలి

బంగారుపాళెం: మతిస్థిమితంలేని యువకుడు సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం తగ్గువారిపల్లె పంచాయతీ పద్మావతి నగర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాబు కుమారుడు మౌలాలి(27)కి మతి స్థిమితం లేదు. ఎక్కడ పడితే అక్కడ తిరుగుతూ ఉంటాడు. ఆ యువకుడు హఠాత్తుగా పద్మావతినగర్‌లో సెల్ టవర్ పైకి ఎక్కి అక్కడ నుంచి కిందకు దూకేస్తా అంటూ కేకలు పెట్టాడు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మతిస్థిమితం లేని యువకుడిని కిందకు దింపే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో చిత్తూరు అగ్నిమాపక సిబ్బంది దృష్టికి తీసుకు వెళ్లారు. ఫైర్ సిబ్బంది పద్మావతినగర్‌కు చేరుకున్నారు. సుమారు గంటపాటు అతనితో మాట్లాడి చాకచక్యంగా కిందకు దింపేశారు. గతంలోనూ మతిస్థిమితంలేని మౌలాలి రెండు సార్లు సెల్ టవర్ ఎక్కి ఇదే తరహాలో హల్‌చల్ చేశాడు.



సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

ONE SITTING

■ One Sitting, 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc, MBA, BBA, BCA, B.Tech, Diploma, Agriculture, Pharmacy, Nursing (for dropouts / backlogs) from UGC recognised universities. Exams in February / March. Cont : 73383 76874

Real Estate

LAND FOR SALE

■ తిరుపతి జిల్లా, నెల్లూరు జిల్లాకు దగ్గరలో రోడ్డు ప్రక్కన 250 ఎర్రచందనం మరియు టేకు చెట్లు గల 110 ఎకరాల పొలం అమ్మబడును. వివరములకు సంప్రదించండి: 90007 31580.

PLOTS FOR SALE

■ తిరుపతి–శ్రీకాళహస్తి 6లైన్ హైవే అనుకొని వున్న మల్లవరం శ్రీ ఇంజనీరింగ్ కాలేజ్ గోపాలపురం అనుకొని వున్న తుడా అప్రూవల్ వెంచర్ నందు 38 (32x39.6) అం.లు గల తూర్పు ముఖం ప్లాట్ అమ్మబడును. 9949825956.

■ తిరుపతి జిల్లా అప్పలాయగుంట గ్రామం, ప్రసన్న వెంకటేశ్వరస్వామి గుడి దగ్గరలో ఉత్తర ముఖం గల 120అం.(40x108)సైట్ అమ్మబడును.1అం. రూ.42,000 మాత్రమే. 93900 80854.

BUSINESS OFFER

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్‌ప్లేట్స్ & LEDబిజినెస్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515824, 8800498710

CHANGE OF NAME

■ I, Devineni Sridevi (Old Name) W/o Devineni Jyothi Prasad Residing at 19-14-82/C, Raghavendra Nagar, 4th Street, Tirupati Urban, Andhra Pradesh I Declared That I Have Changed My Name as Jalakam Sreedevi (New Name)

Wanted

■ ఆఫీస్ బాయ్ & ప్యాకింగ్ హెల్పర్& జీ:11,500, PF & ESI సెక్యూరిటీ గార్డ్స్,సూపర్‌వైజర్స్& ఫీల్డ్ ఆఫీసర్ మార్కెటింగ్ ఆఫీసర్ జీ:15,000 తిరుపతిలో కావలెను. 9989139239, 8904040900.

■ రాధాకృష్ణ స్టీల్, తిరుపతిలో పని చేయుటకు వ్యాపార అనుభవం కల్గిన మేనేజర్ కావలెను. Qul: ఇంటర్, జీ:15-20వేలు, సంప్ర: 8919478212.

■ తిరుపతిలో ప్రముఖ రెస్టారెంట్ కి అనుభవం కల్గిన కెప్టెన్స్(జీ:15K–17K)స్టీవార్డ్స్ (జీ:10K-13K),Panter Master(జీ:15K-20K) కావలెను. 9642496427, 7794955995.

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు అపైన సంపాదించే అవకాశం. 91777 36926

■ మేనకూరు, అత్తివరం పరిసర ప్రాంతాలలో పని చేయుటకు అనుభవం ఉన్న ASO, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12గం॥ల డ్యూటీ, జీతం+PF, ESI కలదు. సంప్ర:81425 42121.

■ Wanted Office Staff Male/Female Below 35 years to Work in Medical Distribution, Tirupati, Computer Operators, Picking, Checking, Supervising, Floor Management and for Despatch. Cont Cell: 9966521536, 9030117007

■ కస్సల్టెన్సీ కాదుVIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీ/పురుషులు ఆయా,నర్సులు, వంట చేయువారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీరూం+భోజనం.HYD.7995365999.

■ తిరుపతి, శ్రీకాళహస్తిలో గల హోటల్స్‌లో పనిచేయుటకు రూంబాయ్స్, సెక్యూరిటీ గార్డ్స్ మరియు హాస్పిటల్స్‌లో పని చేయుటకు ఆయాస్ కావలెను. సంప్ర: 9502083397

■ చెరివి132 KVసబ్‌స్టేషన్ నందు సబ్ ఇంజనీరుగా ఎలక్ట్రికల్ డిప్లొమా OC అభ్యర్థి 1, స్కిల్డ్ (ITI ఎలక్ట్రికల్)OC అభ్యర్థి 1 కావలెను. సంప్ర: కాంట్రాక్టర్ భాస్కర్ నాయుడు, చిత్తూరు రోడ్డు, పీలేరు, ✆ 8309593734.

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024 / 9640400073

■ ప్రముఖ కంపెనీ పూజ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూట్ చేయుటకు జిల్లా డిస్ట్రిబ్యూటర్స్, డీలర్స్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్రదించండి: 91540 11977, 82977 51599.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించుకుని పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులను కోరిన మీదట, ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఓటరు దరఖాస్తుల పరిశీలన పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటరు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసినట్లు డీఆర్‌ఓ రాజశేఖర్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 22న జిల్లా తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ తరువాత జిల్లా వ్యాప్తంగా నమోదైన ఫారం 6,7,8 ఫారంను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలించినట్లు స్పష్టం చేశారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులను పరిశీలించారని చెప్పారు. గత ఏడాది డిసెంబర్ 9 వరకు వచ్చిన అభ్యంతరాలను పూర్తి స్థాయిలో విచారణ చేసినట్లు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంత వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 25వ తేదీన ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈవీఎంల వినియోగం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నూతనంగా నమోదైన ఓటర్లు ఒకే చోట 1400 మందికి పైగా ఉంటే మరో పోలింగ్ కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి ఉదయ్ కుమార్, భాస్కర్, పరదేశి, సురేంద్రకుమార్, కలెక్టరేట్ ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.


ఓటర్ల తుది జాబితా అందించండి



మాట్లాడుతున్న ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్

చిత్తూరు కలెక్టరేట్: తుది ఓటర్ల జాబితా ప్రచురించిన తర్వాత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు తుది జాబితాను అందజేయాలని ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ వెల్లడించారు. జిల్లాకు విచ్చేసిన ఆయన బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు తుది ఓటర్ల జాబితా కసరత్తులో జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఫిర్యాదులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కసరత్తు రికార్డులను కచ్చితంగా నిర్వహించాలని చెప్పారు. తుది ఓటర్ల జాబితాను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత పంపాలని చెప్పారు. ప్రింటింగ్ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో తుది ఓటర్ల జాబితా కసరత్తు పకడ్బందీగా చేపడుతున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో కసరత్తును పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ నెల 22న తప్పులు లేని ఓటర్ల జాబితాకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీఓలు చిన్నయ్య, సుజన, మనోజ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ భవాని, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పెద్దపండుగకే తలమానికం కొండచుట్టు





పెనుమూరు: గిరిప్రదక్షిణకు బయలుదేరుతున్న పులిగుంటీశ్వరుడు, పుత్తూరు: పండరీ భజన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ హరి, తిలకిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: పట్టణంలో కొండచుట్టు పండుగకు పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పూర్వ వైభవం తీసుకొచ్చారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన మండపం వద్ద దశాబ్దం తర్వాత కొలువైన దేవతామూర్తులను మంత్రి రోజాతో పాటు పుత్తూరు ప్రజలు దర్శించుకున్నారు. సంక్రాంతి పండుగలో నాలుగో రోజైన బుధవారం కొండచుట్టు వైభవంగా జరిగింది. మంత్రి రోజా మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఎంతో ప్రీతిపాత్రంగా జరుపుకునే పెద్ద పండుగలో చివరి ఘట్టమైన కొండచుట్టు పండుగకే తలమానికమని అన్నారు. పుత్తూరు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కొండచుట్టు మండపాన్ని రోజా చారిటబుల్ ట్రస్ట్‌చే నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ హరి చేసిన పండరీ భజనను ప్రజలతో కలిసి మంత్రి రోజా తిలకించడం మరో విశేషం.

కొండచుట్టు విశిష్టత

పుత్తూరు పట్టణంలో వెలిసిన శ్రీకామాక్షి సమేత శ్రీసదాశివేశ్వరస్వామి వార్ల ఆహ్వానం మేరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి దేవతామూర్తులు కొండచుట్టు మండపం వద్దకు అతిథులుగా విచ్చేయడం ఆనవాయితీ. ఇలా వచ్చిన వారిలో ముందుగా శ్రీకామాక్షీ సమేత సదాశివేశ్వరస్వామి వచ్చి ఆశీనులు కాగా అతిథులుగా విఘ్నేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత కృష్ణస్వామి, ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి, సీతా సమేత శ్రీరామస్వామి, ఆంజనేయస్వాముల వారు ఉన్నారు. వచ్చిన దేవతామూర్తులంతా గ్రామంలోని విశేషాల గురించి మాట్లాడుకుంటారని ప్రతీతి. పలువురు దేవతామూర్తులను ఒకే చోట కొలువైన దృశ్యాన్ని చూసి తరించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అర్చన, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణం నుంచి మండపం వరకు తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో జనం తరలివచ్చారు.

పులిగుంటీశ్వరస్వామి వైభవం

పెనుమూరు(కార్వేటినగరం) : మండలంలోని పులిగుండుపై వెలసి ఉన్న శ్రీ పులిగుంటీశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం కొండచుట్టు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు. అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి పులిగుండు చుట్టూ మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలతో గిరిప్రదక్షిణ చేపట్టారు. ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కొండచుట్టును పురస్కరించుకుని పులిగుండుకు తరలి వచ్చిన భక్తులతో జనసంద్రంగా మారింది.

ఆశత్తూరులో కొండచుట్టు

కార్వేటినగరం మండల పరిధిలోని ఆశత్తూరు గ్రామ సమీపంలో నిర్వహించిన కొండచుట్టు కార్యక్రమంలో భాగంగా బుధవారం వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఎడ్లపందేలకు పశువులను ప్రత్యేకంగా అలంకరించి ఎడ్ల బండ్లతో భక్తులు తరలిరావడంతో కొండచుట్టులో సందడి నెలకొంది. కొండచుట్టు జనంతో కిక్కిరిసిపోయింది.

బాంబ్ బ్లాస్టింగ్‌లో ఒకరి మృతి



మృతి చెందిన వ్యక్తి

గుడిపాల: బాంబ్ బ్లాస్టింగ్‌లో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం చేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు, చెన్నై–బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు మండలంలో జోరుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రోడ్డు అనుసంధానంలో భాగంగా 190రామాపురం వద్ద రింగ్ రోడ్డును ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో రాకేష్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ బాంబ్ బ్లాస్టింగ్ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం బాంబ్ బ్లాస్టింగ్ చేయడంతో అక్కడ కాపలాగా ఉన్న బిహార్‌కు చెందిన మహ్మద్ ఇర్షద్ రజా (25)పై రాయి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల 'స్వచ్ఛ' సేవ

రేణిగుంట : మండలంలోని డీపీ కండ్రిగకు చెందిన పలువురు యువకులు చెన్నై, బెంగళూరు తదితర నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వచ్చారు. సంబరాలు చేసుకుని వెళ్లిపోకుండా పల్లెను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు నడుంబిగించారు. ఈ మేరకు ఆర్.మల్లవరం నుంచి ఎస్‌యూ పురం మార్గంలో రోడ్డుకు ఇరువైపులా సుమారు 2 కిలోమీటర్ల మేర పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ మద్యం సీసాలను తొలగించారు. ఈ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఈ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

దుమ్మురేపిన కోడెగిత్తలు

- పశువులను నిలువరించేందుకు పోటీ పడిన యువకులు
- రంకెలేస్తూ దూసుకెళ్లిన ఎద్దులు



ఎర్రమట్టిపల్లెలో కోడెగిత్తను నిలువరిస్తున్న యువకులు



వెదురుకుప్పం: దూసుకుపోతున్న కోడెగిత్తలు

పెనుమూరు(కార్వేటినగరం)/వెదురుకుప్పం: సంక్రాంతి సంబరాల్లో చివరి రోజు కనుమ పండుగను బుధవారం కోలాహలంగా నిర్వహించారు. యువకుల కేరింతలు, కోడెగిత్తల రంకెల మధ్య పశువుల పండగ సందడిగా సాగింది. పెనుమూరు, వెదురుకుప్పం మండలాల్లో ఎడ్ల పందేలు నిర్వహించారు. జన సమూహం మధ్యలోనుంచి ఎద్దులు వాయువేగంతో దూసుకెళ్లాయి. వాటిని నిలువరించేందుకు యువకులు సాహసించారు. కొన్ని ఎద్దులను పట్టుకుని వాటి కొమ్ములకు కట్టిన పలకలను లాక్కుని బహుమతులు సాధించారు. వీటిని తిలకించేందుకు జనం చుట్టుపక్కల గ్రామాలనుంచి తరలివచ్చారు. పెనుమూరు మండలం ఎర్రమట్టిపల్లి గ్రామంలో ఎడ్లపందేలు దుమ్మురేపాయి. వైఎస్సార్‌సీపీ జెండాతో కూడిన పలకలు ఎద్దులకు కట్టారు. మరి కొందరు సినీ హీరోల చిత్రపటాలతో కూడిన పలకలు, వస్త్రాలతో ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి పందేనికి సిద్ధం చేశారు. అనంతరం అల్లి వాటిని నిలబెట్టి ఉసిగొల్పారు. దీంతో కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జనసమూహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయాయి. ఎద్దులను నిలువరించి పలకలను పట్టేందుకు యువత పోటీ పడి పలకలను లాక్కొని ధైర్య సాహసాన్ని చాటుకున్నారు. ఈ పందేలను తిలకించేందుకు జనం చెట్లపై, మేడలపై ఎక్కి కోడెగిత్తల దూకుడును చూసి కేరింతలు కొట్టారు.

కోడెగిత్తల జోరు

వెదురుకుప్పం మండలంలోని కురివికుప్పం, బ్రాహ్మణపల్లెలో జరిగిన జల్లికట్టు దుమ్మురేపింది. ఇక్కడ పరుష పందేలుగా పిలిచే పశువుల పందేలు సందడిగా సాగాయి. ఎడ్లకు పలకలు, వస్త్రాలు కట్టి పందేనికి సిద్ధం చేశారు. దశలవారీగా కోడెగిత్తలను ఉసిగొల్పారు. జనాన్ని చీల్చుకుంటూ పరుగులు తీస్తున్న ఎడ్ల వేగాన్ని కట్టడి చేసి కొందరు యువకులు బహుమతులను స్వాధీనం చేసుకున్నారు. అయితే కొన్ని పోట్లగిత్తలు జన సమూహంలోకి దూసుకెళ్లి తొక్కుకుంటూ వెళ్లిపోయాయి. యువకులు ఎంత ప్రయత్నించినా దూకుడును కట్టడి చేయలేక పోయారు. పలకలు లాక్కునే క్రమంలో ఇరువర్గాల వారు తోసుకున్నారు. కొందరు పశువుల కింద పడి పలువురు గాయపడ్డారు.



పెనుమూరు: పరుగులు తీస్తున్న ఎద్దులు



వెదురుకుప్పం: కోడె గిత్తను కట్టడి చేస్తున్న యువత



బ్రాహ్మణపల్లెలో ఎడ్లపందేలను తిలకిస్తున్న జనసందోహం